క్లుప్తంగా

దివ్యాంగులకు సర్కార్ అండ..


దివ్యాంగులతో ముచ్చటిస్తున్న వినయ్ భాస్కర్

హన్మకొండ: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తనను కలువడానికి వచ్చిన దివ్యాంగులతో మెట్లపై కూర్చొని ముచ్చటించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. వారు త్రిచక్ర వాహనాలు కావాలని కోరగా స్పందించిన వినయ్ భాస్కర్ సంబంధిత మంత్రి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌తో మాట్లాడి వీలైనంత త్వరలో అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వీరి అవసరాలు తీర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం ముందుందన్నారు.

హెలికాప్టర్‌లో ఓరుగల్లుకు మాజీ ఉపరాష్ట్రపతి

కాజీపేట రూరల్: కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ గ్రౌండ్‌కు శనివారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. నగరంలో ప్రైవేట్ విద్యాసంస్థల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన ఉదయం 9:15 గంటలకు చేరుకోగా ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు స్వాగతం పలికి బందోబస్తు కల్పించారు. తిరుగు ప్రయాణంలో వెంకయ్యనాయుడు 11:30 గంటలకు సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ గ్రౌండ్‌కు చేరుకొని హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్లారని జిల్లా అధికారులు తెలిపారు.

ప్రీతిలాంటి ఘటనలు పునరావృతం కావొద్దు

కాజీపేట: పాఠశాల స్థాయిలోనే సరైన రీతిలో కట్టడి చేసేలా ప్రభుత్వం కఠిన చర్యలు చేపడితే ప్రీతిలాంటి ఘటనలు మరోమారు పునరావృతం కాకుండా ఉంటాయని బీసీటీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి అన్నారు. కాజీపేట 61వ డివిజన్ ఫాతిమానగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థలోని లోపాలు నానాటికి తీవ్రమవుతున్న నేపథ్యంలో హత్యలు, ఆత్మహత్యలు పెరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని కన్నవాళ్లు కంటున్న కలలు నిస్తేజంగా మారుతుండడంతో తీరని దుఃఖానికి లోనవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కఠిన చర్యలను అమలు చేయాలని కోరారు.

గ్యాస్ సరఫరాలో అదనపు వసూళ్లు

కాజీపేట: గ్యాస్ సరఫరా సమయంలో అధిక ధరలు వసూలు చేస్తున్న ఏజెన్సీపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కాజీపేట మండలం కొండపర్తి, భట్టుపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఆన్‌లైన్‌లో అధికారులకు ఫిర్యాదులు చేశారు. కాజీపేట చౌరస్తాలో శనివారం విలేకరులను కలిసి ఇప్పటికే ప్రభుత్వం ధరలు పెంచుతుంటే గ్యాస్ ఏజెన్సీలు అదనంగా రూ.40 వరకు వసూలు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలానే డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి జరిమానా విధించి అధికారులు చేతులు దులుపుకున్నట్లు విమర్శిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ఎవరినీ లెక్క చేయకుండా అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్న ఏజెన్సీపై విచారణ జరిపించాలని దిలిప్ అనే స్థానికుడు కోరారు.

జర్నలిస్ట్ కుటుంబాలకు హెల్త్ కార్డుల పంపిణీ

కాజీపేట: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను 50 మంది జర్నలిస్టు కుటుంబాలకు రేహన్ జిరాక్స్ యజమాని సుబాన్ ఈ-కేవైసీ చేసి అందజేశారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో శనివారం జర్నలిస్టు కుటుంబ సభ్యులకు కార్డులను అందించారు. కార్యక్రమంలో కె.రవికుమార్, పి.రంజిత్ కుమార్, గిరి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఖిలా వరంగల్: యువతిపై కర్రతో దాడికి చేసిన తల్లి, కొడుకుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్ దర్గా సమీపం బహదూర్‌పురకు చెందిన ఎండీ మాషూక్‌కు సోదరి షబానా ఉంది. ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఇర్ఫాన్ అనే యువకుడు తరుచూ షబానాను చూస్తూ ఫొటోలు తీస్తున్నాడు. గమనించిన షబానా తన సోదరుడైన ఎండీ మాషూక్‌కు జరిగిన విషయాన్ని చెప్పింది. దీనిపై మాషూక్ ఇర్ఫాన్‌ను మందలించాడు. దీంతో ఇర్ఫాన్ అతడి తల్లి షబానా ఇద్దరు కలిసి షబానాపై శుక్రవారం రాత్రి కర్రతో దాడి చేసితీవ్రంగా గాయపర్చారు. కుటుంబ సభ్యులు ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. షబానా సోదరుడు ఎండీ మాషూక్ ఫిర్యాదు మేరకు శనివారం తల్లి షబానా, కుమారుడు ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కేంద్రానివి రైతు వ్యతిరేక విధానాలు


సదస్సులో మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

హన్మకొండ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు అవలంబిస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ విమర్శించారు. శనివారం హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ రైతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సదస్సులో ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలు నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని, దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ అమలు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు పార్లమెంట్ నుంచి ఉపసంహరించుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో మహా రైతు, కార్మిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతు సంఘం హన్మకొండ జిల్లా కార్యదర్శి చుక్కయ్య మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 11 వరకు మండల కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని, 12 నుంచి 25 వరకు గ్రామగ్రామాన పాదయాత్రలు, జాతాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి పర్వతాలు, రాములు, స్వరూప, బొట్ల చక్రపాణి, ప్రభాకర్ రెడ్డి, రజిత పాల్గొన్నారు.

అభినందన


సాత్వికసాయిని అభినందిస్తున్న వీసీ, ప్రిన్సిపాల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఐ.టీ విభాగం విద్యార్థిని సాత్వికసాయికి టీసీఎస్ బెస్ట్ ఎథికల్ హాకర్ అవార్డు లభించింది. టీసీఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన టీసీఎస్‌హాక్‌క్వెస్ట్ -7 రెండు రౌండ్ల వర్చువల్ పోటీల్లో వివిధ రాష్ట్రాలనుంచి ఎథికల్ హ్యాకింగ్ ప్రతిభావంతులు 58వేల మంది పాల్గొన్నారని ఈపోటీల్లో కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని సాత్వికసాయి రెండు రౌండ్లలో వర్చువల్ ఎథికల్‌హ్యాకింగ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనపర్చి నాల్గవ ర్యాంకు సాధించారని ప్రిన్సిపాల్ సదానందం శనివారం తెలిపారు. ప్రతిభకనపర్చిన సాత్వికసాయి రూ.10వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారు. సాత్వికసాయిని కేయూ వీసీ తాటికొండ రమేష్, ప్రిన్సిపాల్ సదానందం అభినందించారు.

వెంకన్న ఆలయంలో ఊంజల్ సేవ

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలో కొలువుదీరిన గోదాదేవి, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి దేవతామూర్తులకు ఊంజల్ సేవ నిర్వహించారు. వేదపండితులు నల్లాన్‌ల చక్రవర్తాచార్యులు ఆధ్వర్యంలో 21 మంది పండితులు ఊంజాల సేవ జరుపించారు. భక్తులకు మహాన్నదానం చేశారు.

చట్టాలపై అవగాహన

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సఖి కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు శారద అధ్యక్షతన శనివారం బాలిక రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సైకో సోషల్ కౌన్సిలర్ నూర్జహాన్, సుధా హాజరై మాట్లాడారు. బాలికలు ఫోక్సో యాక్ట్, సఖి కేంద్రం సేవలను తెలుసుకోవాలన్నారు. బాధితుల భద్రత సహాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సఖి కేంద్రాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో మహిళా హెల్ప్‌లైన్ 181, 1098, 100, 0870, 2935014 లకు ఫోన్ చేయాలని సత్వరమే సాయం అందుతుందని వివరించారు.

25న కేయూలో విద్యార్థి ఉద్యమకారుల సభ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ విద్యార్థిసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 25న విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు కేయూ విద్యార్థి సంఘాల జాక్ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కన్నా శనివారం తెలిపారు. ఈనెల 3న నిర్వహించాల్సిన సభను వాయిదా వేసినట్లు వెల్లడించారు.

వీధికుక్కలతో జాగ్రత్తగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సాంబయ్య

ఖిలా వరంగల్: వీధి కుక్కలతో విద్యార్థులు, చిన్నారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని బల్దియా సూపర్ వైజర్ సాంబయ్య సూచించారు. ఈమేరకు శనివారం వరంగల్ రైల్వేగేట్ పెరకవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీధి కుక్కల జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వీధికుక్కలను చూసి విద్యార్థులు పరుగులు పెట్టకూడదని, కళ్లల్లో నేరుగా చూడొద్దని, రాళ్లు, కర్రలు విసిరకూడదని, ధైర్యంగా నిలబడితే పక్కకు వెళ్లిపోతాయని సూచించారు. నిద్రపోతున్న కుక్కలకు భంగం కలిగించొద్దని, ఆటపట్టించొద్దని సూచించారు. వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

'ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదు'


హసన్‌పర్తికి చేరిన పాదయాత్ర

హసన్‌పర్తి: రానున్న సాధారణ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన సంగ్రామ పాదయాత్ర శనివారం హసన్‌పర్తికి చేరిన సందర్భంగా ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. అనంతరం దినేష్ మాదిగ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ తమ మేనిఫెస్టోల్లో పేర్కొని.. నేటికీ పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈనెల 15న హైదరాబాద్‌ను లక్షలాది మందితో దిగ్బంధనం చేయనున్నట్లు చెప్పారు. పలివేల్పుల, భీమారం, గోపాలపురంల్లో సాగిన యాత్రలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు, రాజారపు బిక్షపతి, శాంతిసాగర్, రవికుమార్, కల్యాణ్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడల ప్రారంభోత్సవంలో టీఎన్జీవోస్ నాయకులు


మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

కాశిబుగ్గ: నిత్యం విధి నిర్వహణలో బీజీగా ఉండే ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్, జిల్లా యువజన క్రీడల అధికారి ఇందిర అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టిఎన్జీవోస్ యూనియన్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఓ సిటీ స్టేడియంలో మహిళ ఉద్యోగులకు క్రీడల పోటీలు నిర్వహించారు. పోటీలు ప్రారంభించిన అనంతరం అధ్యక్షులు, క్రీడల అధికారి మాట్లాడారు. క్రీడలు, యోగా ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయన్నారు. 6వ తేదీ న మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. క్రీడల్లో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి గాజ వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, గద్దల రాజు, రమాదేవి, రజిత, జ్యోతి, గణేష్, రాజేశ్వరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చర్యలు

హన్మకొండ చౌరస్తా: మహిళల రక్షణ కోసం సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని మేయర్ సుధారాణి అన్నారు. టీఎన్జీఓఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని టీఎన్జీఓఎస్ భవన్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సుధారాణిని సత్కరించారు.

క్రైమ్ న్యూస్..

రైలులో ప్రయాణికురాలి మృతి


రూబీ పర్వీన్

కాశిబుగ్గ: దానాపూర్ నుంచి బెంగుళూరుకు వెళ్లే సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ ప్రయాణికురాలు అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం ఈస్ట్ చంపారన్ జిల్లా కుషహర్ తోల మతియా, తాన కేసరియకు చెందిన ఎండీ రూబీ పర్వీన్(19) గత 15 రోజులుగా 15 అపెండిక్స్ సైటీస్(24 గంటల కడుపు నొప్పి)తో బాధపడుతోంది. ఈక్రమంలో భర్త ఎండీ సలాముద్దీన్‌తో కలిసి మెరుగైన వైద్యం కోసం బెంగుళూరులో ఉన్న తల్లిదండ్రుల వద్దకు రైలులో బయల్దేరారు. రైలు వరంగల్ రైల్వే స్టేషన్ చేరుకునేలోపే తీవ్ర అస్వస్థతకు గురై రైలులో మృతి చెందింది. గమనించిన తోటి ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైలు వరంగల్ స్టేషన్‌కు చేరుకోగానే రైల్వే ఎస్సై ఐలయ్య మృతదేహాన్ని కిందకు దించి అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించామని తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి..

నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన ఇంటికన్నె, నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన ప్రకారం.. సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగి 5.5 ఎత్తు, చామన ఛాయ, కోళముఖం కలిగి క్రీమ్ కలర్ ఫుల్ షర్ట్, బూడిద కలర్ లోయర్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ నెక్కొండ గోడౌన్స్ సమీపంలో జారి పడి మృతి చెందాడని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని సీఐ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిసినచో 9441557232, 9440627532 నంబర్‌లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

పేదలపై ఆర్థికభారం సరికాదు

గ్యాస్ ధరలు పెంచి, పేదలపై ఆర్థికభారం మోపడం సరికాదని పలువురు పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడంపై నగరంలో శనివారం పలుచోట్ల మహిళలు, వివిధ సంఘాల నాయకులు ఆందోళనలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


కాశిబుగ్గ: ఏసిరెడ్డినగర్‌లో..


హసన్‌పర్తి: ఎర్రగట్టుక్రాస్ వద్ద..

మహిళా సదస్సును విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అంజనీదేవి

విద్యారణ్యపురి: అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న హనుమకొండలో నిర్వహించనున్న మహిళా సదస్సును విజయవంతం చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు అంజనీదేవి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని డీటీఎఫ్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల డీటీఎఫ్ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈనెల 8న మధ్యాహ్నం నిర్వహించే సదస్సుకు ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ మహిళా రెండు జిల్లాల బాధ్యులు సుధారాణి, భారతి, సుమిత్రాదేవి, అనిత, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సుదర్శనం, గోవిందరావు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశాయిపేట: మార్చి 8న నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రముఖ గైనాకాలజిస్ట్ డాక్టర్ సంధ్యారాణి అన్నారు. శనివారం దేశాయిపేటలోని సీకేఎం కాలేజీలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. కళాశాలలోని విద్యార్థినులు రోజూ ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. బీపీ, హిమోగ్లోబిన్ శాతం, రక్త పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌రావు, చందా విజయ్‌కుమార్, ధర్మారెడ్డి, అనిల్, సుమలత, వసుధ, అరుణ, రాజశ్రీ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు..'


యాత్రలో మాట్లాడుతున్న సురేఖ

ఖిలా వరంగల్: బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలే బుద్ధిచెప్పాలని, తెలంగాణలో రానున్నది ఇందిరమ్మ రాజ్యమేనని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కొండా సురేఖ ధీమావ్యక్తం చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శనివారం వరంగల్ 39వ డివిజన్ కరీమాబాద్ రోడ్డులోని బొమ్మల గుడిలో కాశీవిశ్వేరున్ని ఆమె దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాంగ్రెస్ నేతలు నల్కొండ రమేష్, మీసాల ప్రకాశ్, సిద్దం రాములతో కలిసి మాట్లాడారు. ప్రజలను తప్పుదారి పట్టించడానికే అధికార పార్టీ నాయకులు ధర్నాలు చేస్తున్నారని, ఫామ్ హౌస్ నుంచి స్క్రిప్ట్ వస్తేనే ఎమ్మెల్యేలు మంత్రులు చదివే పరిస్థితి ఉందన్నారు. కబ్జాలకు పాల్పడుతున్న కార్పొరేటర్లు డివిజన్ల కంటే పోలీస్ స్టేషన్‌లో ఎక్కువ సేపు ఉంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సిద్దం రామన్నపటేల్, బైరిశెట్టి శ్రీలత, కిరణ్, వెంకటేశ్వర్లు, సాజిద్, మురళి, స్వప్నగౌడ్, సంపత్, శ్రీధర్, శివ, చిన్నమల్లు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పరిశీలన


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేందర్

దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటలో జర్నలిస్టుల కోసం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులను తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, స్థానిక కార్పొరేటర్ కావటి కవితయాదవ్‌తో కలసి శనివారం పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు.

సంక్షిప్త సమాచారం..

యువతకు ఉపాధి శిక్షణ

మడికొండ: నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఫర్ ఎక్సెస్ నిర్వాహకుడు మహేష్ తెలిపారు. మడికొండ వ్యాసపురి కాలనీ శ్రీ వేద వ్యాస్ పబ్లిక్‌స్కూల్ ఆవరణలో సేవా భారతి,గోద్రెజ్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎక్సెస్ సహకారంతో ఎయిర్ కండిషనర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, మైక్రోవేవ్‌ల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈనెల 6వ తేదీ నుంచి ఈ కోర్సులు ప్రారంభం అవుతాయని తెలిపారు. మూడునెలల పాటు శిక్షణ ఉంటుందని, మరిన్ని వివరాలకు 90599 07740 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

ఏవైసీ మహాసభకు తరలిన నాయకులు

కరీమాబాద్: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించనున్న అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర మహాసభకు వరంగల్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బొమ్మల అంబేడ్కర్, మిద్దెపాక ఎల్లయ్య, యాడాల రవీందర్, కొమ్ముల సురేందర్, ఏసుట్ల రవీందర్, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్, నీలం మల్లేశం, జగపతిరాజు, బాబు, రాజు, సారయ్య, రాంప్రసాద్, సిద్ధార్థ, సురేందర్, శివ ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కరీమాబాద్: వరంగల్ ఉర్సు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పోగు అశోక్ స్టడీ మెటీరియల్ అందజేశారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండడమే కాకుండా మంచి మార్కులు తెచ్చుకోవాలనే ఆలోచనతో స్టడీ మెటీరియల్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుర్ర రమేష్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, కిషన్, స్వామి, సంధ్యారాణిలు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ డే సంబురాలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో ఇగ్లిస్ డే సంబురాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లిష్‌పై విద్యార్థులు ప్రదర్శించిన కృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తిరుమలేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ గడ్డం వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, కల్పనారెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌కు సన్మానం

కాజీపేట రూరల్: కాజీపేట సేయింట్ గ్యాబ్రియెల్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న హిందీ టీచర్ హుమేర శనివారం నిర్వహిచపదవీ విరమణ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్స్‌పాల్ బ్రదర్ అరుణ్‌ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. టీచర్ ఉమేర 19 సంవత్సరాలు స్కూల్‌లో హిందీ టీచర్‌గా విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పించిందని తెలిపారు. అనంతరం అరుణ్‌ప్రకాష్ ఉపాధ్యాయ బృందం కలిసి టీచర్ హుమేరను సన్మానించి, వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

నేడు అవగాహన సదస్సు

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని ములుగు రోడ్డు కమ్యూనిటీ సెంటర్‌లో ఆదివారం వివిధ పోటీపరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.ఏ.నయిమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిపుణులచే పోటీపరీక్షలకు ఎలా ప్రిపరేషన్ కావాలనే అంశంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

నేడు ర్యాలీ

మడికొండ: ప్రపంచ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా మేనేజర్ జయశ్రీ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మహిళా ప్రాంగణం నుంచి ర్యాలీ ప్రారంభమవుతోందన్నారు. అనంతరం ర్యాగింగ్ భూతానికి బలీన డాక్టర్ ప్రీతి మృతికి నివాళులర్పించడం జరుగుతోందన్నారు.

విగ్రహ ఏర్పాటు వద్దు

నయీంనగర్: బాహుపేటలో రాజకీయనాయకుల గోరీల వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు వద్దని, ఈ నిర్ణయం అంబేడ్కర్ వాదులు, బహుజనుల ఆత్మ గౌరవానికి భంగం కలుగుతుందని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు ప్రవీణ్ మాదిగ అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్ మాట్లాడారు. విశాలమైన నూతన గ్రామ పంచాయతీ స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, ఆనంద్, సంపత్, రజినికాంత్ పాల్గొన్నారు.

ఎల్బీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీ.హెచ్.రావు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు వివిధ కళాశాలల నుంచి 322 మంది విద్యార్థులు పాల్గొని పేర్లు నమోదు చేసుకుని పాల్గొనగా 37 ఎంపికైనట్లు తెలిపారు. హైదరాబాద్‌కు ఏఐబిటీ ఏనేబుల్ సర్వీస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఈ జాబ్ మేళాను నిర్వహించినట్లు పేర్కొన్నారు. టాస్క్ వరంగల్ మేనేజర్ రామకృష్ణ, ప్లేస్‌మేంట్ కన్వీనర్ శృతి, సభ్యులు రాజేశ్వర్ రావు, రాణి, మమత, అఫ్జల్ పాల్గొన్నారు.

బోరు మోటార్‌తో తాగునీటి సరఫరా

ఖిలా వరంగల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మధ్యకోట ప్రధాన రహదారిపై బోరుకు మోటార్ బిగించి తాగునీరు సరఫరా చేస్తున్నామని స్థానిక మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ తెలిపారు. ఈమేరకు శనివారం ఖిలా వరంగల్ మధ్యకోట ప్రధాన రహదారిపై మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేతిబోరుకు నీళ్లమోటార్ వేసి తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. తాగునీరు అందించిన మాజీ కార్పొరేటర్ దామోదర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీవన్‌గౌడ్, శ్రీనివాస్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్షా సామగ్రి అందజేస్తున్న దాతలు

హసన్‌పర్తి: ముచ్చర్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థి వెంకటేశ్వర్లు శుక్రవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రంగనాథ్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సూర ప్రమోద్, శ్రీధర్, చిర్ర రాజేందర్, రాజేష్, బండా సాయిరెడ్డి, సాంబశివారెడ్డి, శ్రవణ్ పాల్గొన్నారు.